# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 26-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రజల భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- ఆవిష్కరణలు, పారదర్శకత, సామర్థ్యానికి కృత్రిమ మేథ (ఏఐ) కొత్త పునాదిగా మారుతోందని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు.

- వెనెజులాలో భూకంప అనంతర సహాయక చర్యలకు మద్దతుగా భారత్ “ఆపరేషన్ అమిస్తాద్” ప్రారంభించినట్లు కేంద్రమంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ప్రకటించారు.

- రెండు టీ-20ల సిరీస్‌లో భాగంగా భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య తొలి క్రికెట్ మ్యాచ్ బెల్‌ఫాస్ట్ లో జరుగుతోంది.

========================

నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రజల భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు పేర్కొన్నారు. డ్రగ్స్ లేని భారతదేశాన్ని నిర్మించాల్సిన ప్రాముఖ్యతపై సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బి.ఎల్. వర్మ రాసిన ఒక వ్యాసాన్ని ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీ ఈ విషయాలను పంచుకున్నారు. డ్రగ్స్ రహిత భారతదేశం `వికసిత భారత్` నిర్మాణ లక్ష్యంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మోదీ పిలుపునిచ్చారు. మంత్రి బి.ఎల్. వర్మ తన వ్యాసంలో... మత్తుపదార్థాల దుర్వినియోగాన్ని దేశ యువత భవిష్యత్తుతో, దేశ పురోగతితో ముడిపడి ఉన్న ఒక తీవ్రమైన సమస్యగా ప్రభుత్వం పరిగణిస్తోందని పేర్కొన్నారు.

========================

ఆవిష్కరణలు, పారదర్శకత, సామర్థ్యానికి కృత్రిమ మేథ (ఏఐ) కొత్త పునాదిగా మారుతోందని కేంద్ర సంస్కృతి, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ICAI) ఈ రోజు నిర్వహించిన `AI ఇన్నోవేషన్ సమిట్`లో కేంద్రమంత్రి ప్రసంగించారు. వికసిత్ భారత్

సంకల్పాన్ని సాకారం చేయడంలో ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడిన గజేంద్ర సింగ్ షెకావత్... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రంగాన్ని మార్చబోతోందని, ప్రతి ఒక్కరి జీవితాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

`నషా ముక్త్ భారత్` నిర్మాణానికి దేశ ప్రజలు తమ ఉమ్మడి సంకల్పాన్ని పునరుద్ఘాటించాలని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ రోజు అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఉప రాష్ట్రపతి తన సందేశాన్ని అందిస్తూ... ఈ ఉద్యమాన్ని చురుగ్గా ముందుకు తీసుకెళ్తున్న విశ్వ విద్యాలయాలు, విద్యా సంస్థలు, ఇతర సంస్థలను అభినందించారు. బలమైన, ఆరోగ్యకరమైన, వ్యసన రహిత భారతదేశాన్ని నిర్మించడంలో అవి అమూల్యమైన సహకారాన్ని అందిస్తున్నాయని పేర్కొన్నారు. వ్యసనానికి బదులుగా ఆశ, ఆరోగ్యం, ఒక లక్ష్యంతో కూడిన జీవితాన్ని ఎంచుకునేలా యువతను ప్రేరేపించడానికి అందరూ కలిసికట్టుగా నిలబడాలని ఉపరాష్ట్రపతి కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన నార్కో-కోఆర్డినేషన్ సెంటర్ (NCORD) 10వ అత్యున్నత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. మత్తుపదార్థాల ముప్పు దేశ భద్రతకు, సామాజిక స్థిరత్వానికి, ఆర్థిక ప్రయోజనాలకు, యువత భవిష్యత్‌కు ప్రమాదకరమని పేర్కొన్నారు. ఈ పోరాటంలో విజయం సాధించేందుకు ఆధ్యాత్మిక నాయకులు, యువతతో సహా అందరూ ఒకే వేదికపైకి రావాలని హోం మంత్రి అమిత్ షా కోరారు. 2004 నుండి 2014 మధ్య కాలంలో అధికారులు దాదాపు 26 లక్షల కిలోల సింథటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారని, 2014 నుండి 2026 మధ్య కాలంలో స్వాధీనం చేసుకున్న సింథటిక్ డ్రగ్స్ పరిమాణం కోటీ 8 లక్షల కిలోలకు పెరిగిందని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేపట్టిన ప్రచారం స్థిరమైన పురోగతిని సాధిస్తోందని అమిత్ షా తెలియజేస్తూ ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

సత్యం, న్యాయం కోసం నిలబడేలా హజ్రత్ ఇమామ్ హుస్సేన్ నేటికీ ఎంతో మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ రోజు ఆషూరా-ఎ- మొహర్రం సందర్భంగా హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన త్యాగాలను ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్మరించుకున్నారు. ధైర్యం, దృఢ సంకల్పం యొక్క శాశ్వతమైన శక్తిని కూడా ఇది గుర్తు చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని వివిధ ప్రాంతాలలో ఈ రోజు ఆషూరా-ఎ-మొహర్రమ్‌ను ఎంతో భక్తిశ్రద్ధలతో, జరుపుకుంటున్నారు. ప్రవక్త మహమ్మద్ మనవడైన హజ్రత్ ఇమామ్ హుస్సేన్ అమరత్వాన్ని ఈరోజు సూచిస్తుంది. కర్బలాలో సత్యం, ధర్మం, న్యాయాన్ని కాపాడటం కోసం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ తన ప్రాణాలను అర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని తాజియా (Tazia) ఊరేగింపులు నిర్వహించారు. ఢిల్లీలోని జామా మసీదు, నిజాముద్దీన్, ఓఖ్లా, మెహ్రౌలీ సహా వివిధ ప్రాంతాలలో మొహర్రం ఊరేగింపులు జరిపారు. కర్బలా అమరవీరుల అత్యున్నత త్యాగాన్ని చాటిచెప్పే `మజాలిస్` (ఆధ్యాత్మిక సమావేశాలు) కూడా నిర్వహించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వెనెజులాలో భూకంప అనంతర సహాయక చర్యలకు మద్దతుగా భారత్ `ఆపరేషన్ అమిస్తాద్` ప్రారంభించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈ రోజు ప్రకటించారు. అత్యవసర మానవతా సహాయ సామగ్రితో రెండు భారతీయ వైమానిక దళ సి-17 విమానాలు వెనెజులాకు బయలుదేరాయని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ సహాయంలో భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, రెండు `భీష్మ క్యూబ్స్`తో

సహా 35 టన్నులకు పైగా సహాయక సామాగ్రి, మందులు, వైద్య పరికరాలు ఉన్నాయని పేర్కొన్నారు. స్పానిష్ భాషలో `అమిస్తాద్` అంటే స్నేహం అని అర్థం.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ రోజు ఉప-హిమాలయ పశ్చిమ బెంగాల్, బీహార్, తీర ప్రాంత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కొంకణ్, గోవాతో పాటు పలు ఈశాన్య రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. రాబోయే రెండు మూడు రోజుల్లో ఢిల్లీ, జార్ఖండ్, ఒడిశా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, విదర్భ, తూర్పు రాజస్థాన్‌లలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. మరిన్ని వివరాలను వాతావరణ శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్ తెలియజేస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రెండు టీ-20ల సిరీస్‌లో భాగంగా భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య తొలి క్రికెట్ మ్యాచ్ బెల్‌ఫాస్ట్ లో జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్... భారత్ కు 183 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. లక్ష్య చేధనకు దిగిన భారత్ 7 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 3, అక్షర్ పటేల్, హర్షదీప్ సింగ్ రెండేసి వికెట్లు తీశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - జపాన్ 16వ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు జపాన్ ప్రధానమంత్రి సనాయ్ తకైచి వచ్చే నెల 1 నుండి 3వ తేదీ వరకు న్యూఢిల్లీలో అధికారికంగా పర్యటించనున్నారు. ఈ సదస్సు రెండు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన అన్ని అంశాలను సమీక్షించడానికి, బలోపేతం చేయడానికి  ఇరుపక్షాలకు ఒక మంచి అవకాశాన్ని  కల్పిస్తుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపింది. జపాన్ ప్రధాని తకైచి భారతదేశంలో అధికారికంగా పర్యటించడం ఇదే మొదటిసారి. గతేడాది ఆగస్టులో 15వ భారత్-జపాన్ వార్షిక సదస్సు కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టోక్యో పర్యటనను అనుసరించి ఈ పర్యటన జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఢిల్లీలో ఈ రోజు భూటాన్ విద్యా శాఖ మంత్రి యీజాంగ్ దే థాపాతో సమావేశమయ్యారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆ వివరాలను పంచుకున్నారు. ఉపాధ్యాయుల శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, డిజిటల్ విద్య, కృత్రిమ మేధ, స్థిరమైన పర్యాటకం, సాంప్రదాయ వైద్యం, సంపూర్ణ ఆరోగ్యం వంటి అంశాలపై ఈ చర్చలు ప్రధానంగా సాగాయని తెలిపారు. విద్యాభ్యాసం, ఆవిష్కరణలు, సామర్థ్య పెంపొందింపు వంటి విస్తృత వేదికలపై ఇరు దేశాలు కలిసి పని చేయడానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. భారత్-భూటాన్ భాగస్వామ్యం భవిష్యత్‌పై ఉన్న ఉమ్మడి ఆకాంక్షలు, ఆధ్యాత్మిక బంధాలపై ఆధారపడి ఉందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC) తన `భారత్ గౌరవ్ డీలక్స్ టూరిస్ట్ రైలు`లో `డివైన్ ఈస్ట్ టెంపుల్ టూర్` (Divine East Temple Tour) పేరుతో కొత్త పర్యాటక మార్గాన్ని  ప్రవేశపెట్టింది. 11 రోజుల పాటు సాగే ఈ పర్యటనలో భక్తులు, పర్యాటకులు ఉత్తరప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లలోని అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలతో పాటు సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను సందర్శిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =